# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాల సాధనలో పది సూత్రాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది.

- ❖ ఎరువుల విక్రయాల్లో రైతులను ఇబ్బంది పెడితే డీలర్లు, సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి కె. అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో భారతదేశం అభివృద్ధిలో మరింతగా ముందుకు సాగుతోందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.

- ❖ రాష్ట్రంలోని కార్మికులకు సంక్షేమ పథకాల సేవలను సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనలో పది సూత్రాల అమలుపై ఈరోజు ఒక ఎంఒయూ జరిగింది. రాష్ట్ర ప్రణాళికా విభాగంతో కేఆర్ఈఏ యూనివర్సిటీ సారధ్యంలోని ఇనిస్టిట్యూ ట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్) ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఒప్పందాలు మార్చుకున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్ ఏర్పాటుతో పాటు పర్యవేక్షణపై ఐఎఫ్ఎంఆర్ పని చేయనుంది. పేదరిక నిర్మూలన, నీటి భద్రత, డీప్ టెక్ మిషన్లపై ఐఎఫ్ఎంఆర్ రాష్ట్రంలో పని చేయనుంది. పది సూత్రాల అమలుపై రాష్ట్ర స్థాయి కమిటీతో పాటు మిషన్ వర్కింగ్ గ్రూప్ లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

=====================

రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఎరువుల లభ్యత, పంపిణీపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యూరియా లేదా డీఏపీ కొనుగోలు చేసే రైతులకు కాంప్లెక్స్ ఎరువులను బలవంతంగా విక్రయించే విధానాన్ని అరికట్టాలన్నారు. రైతులను ఇబ్బంది పెడితే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, కంపెనీలపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైన ఎరువులనే అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవసరానికి మించి అధిక ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. యూరియా సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. అలాగే సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని, సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని పేర్కొన్నారు. అధిక ఎరువుల వినియోగంపై రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ఎరువుల బుకింగ్, యాప్ నిర్వహణ సజావుగా ఉండాలని, ఓటీపీ ఆలస్యం, మెసేజ్ లింక్ వేగంగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి తెలియజేశారు.

=====================

స్త్రీ శక్తి పథకానికి రోజుకు 8 కోట్ల 50 లక్షల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తోందని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్  రెడ్డి తెలిపారు. రవాణా శాఖ రెండేళ్ల పాలన పురోగతిపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. వాహన యాప్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అలాగే వాహనదారులకు 19 ఫిట్ నెస్ పరీక్షలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు. పన్నుల చెల్లింపు విధానంలో కూడా ప్రజలు సంతృప్తి గానే ఉన్నారని, అన్ని విషయాల్లో రవాణా రంగం ముందుకు వెళ్తోందని తెలిపారు. RTCపై ఎలాంటి భారం పడకుండా స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. అలాగే దివ్యాంగ శక్తి పథకం కూడా విజయవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయవంతంగా 12 ఏళ్ల సుపరిపాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కోరారు. నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రముఖ వ్యాపారవేత్తలు, వైద్యులు, విద్యావేత్తలతో సమావేశమైన కేంద్రమంత్రి ప్రభుత్వం సాధించిన  విజయాలు, అద్భుతమైన అభివృద్ధి గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టికల్ 370 రద్దు, మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ ఇండియా  ద్వారా ప్రపంచానికే ఆదర్శంగా నిలవడంతో పాటు భారతదేశం 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం వంటి విజయాలను వారికి వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో జి-20 సదస్సును విజయవంతంగా నిర్వహించడం, కరోనా వంటి విపత్కర సమయంలో ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేయడం ద్వారా నేడు భారతదేశం ఒక `విశ్వగురువు`గా అభివృద్ధి చెందిన తీరును మంత్రి ప్రస్తావించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ప్రగతికి సంబంధించిన ప్రత్యేక పుస్తకాలను వారికి అందజేసారు.

విరామం

=====================

కార్మికులకు సంక్షేమ పథకాల సేవలను సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ కార్మికుల సంక్షేమ బోర్డు 45వ సమావేశంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. కార్మిక సంక్షేమ కార్యక్రమాలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా కార్మికులకు చేరవేసేందుకు రూపొందించిన సంక్షేమ బోర్డు నూతన వెబ్‌సైట్‌ను మంత్రి ఈ సందర్భంగా  ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... కార్మిక సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. నూతన వెబ్‌సైట్ ద్వారా కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్ధిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్మికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా డిజిటల్ వేదికలను అభివృద్ధి

చేస్తున్నామని మంత్రి తెలిపారు. 45వ బోర్డు సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

=====================

రాష్ట్రంలోని ఐదు బోధనాసుపత్రుల్లో తొలిసారిగా కృత్రిమ అవయవాల తయారీ యూనిట్లు రాబోతున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ కాళ్లు, చేతులు, వీల్ ఛైర్లు, వినికిడి పరికరాలు, ఇతర సహాయ ఉపకరణాల తయారీ ఈ కేంద్రాల్లో జరుగుతాయని ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యులు సూచించే అవసరమైన కృత్రిమ కాళ్లు, చేతులు ఇవ్వడం వల్ల దివ్యాంగులకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాసిన లేఖ మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ తయారీ యూనిట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. తొలివిడత కింద ఒంగోలు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, విశాఖ సర్వజన ఆసుపత్రుల్లో ఈ తయారీ యూనిట్లు ఏర్పాటుకానున్నాయని, వీటికి అవసరమైన స్థలాలు, నిర్మాణాలు, ఇతర వసతుల పరిశీలన, కేంద్ర బృందాల ద్వారా ఈరోజు నుంచి ప్రారంభమైందని తెలిపారు.

=====================

తిరుపతి జిల్లా సదాశివకోనలో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన శాసనాలు గుర్తించామని భారతీయ పురావస్తు శాఖ డైరెక్టర్ ఎం.మునిరత్నం రెడ్డి తెలిపారు. 477 సంవత్సరాల క్రితం చెక్కిన శాసనాలను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు. అటవీశాఖ అధికారులతో కలిసి సదాశివకోనలో పర్యటించిన ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ… సదాశివకోనలో బయటపడిన శాసనాల్లో గుడిమల్లం ఆలయం చరిత్ర.. మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే శాసనాలను చెక్కినట్లు చెప్పారు. ఇప్పటికే 85 వేల శాసనాలను దేశవ్యాప్తంగా గుర్తించామని ఆయన తెలియజేస్తూ…

(వాయిస్ 21 సెకన్లు)

=====================

తూర్పు ఉత్తర ప్రదేశ్ నుండి తెలంగాణ వరకు కొనసాగుతున్న నిన్నటి అల్పపీడన ద్రోణి రాయలసీమ, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది.

=====================
=====================